# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-05-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. "వికసిత భారత్" నిర్మాణంలో కీలక పాత్ర పోషించేలా రాష్ట్రాభివృద్ధి కొనసాగుతోందని పేర్కొన్న కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు.**

**2. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందన్న మంత్రి వై. సత్యకుమార్ యాదవ్.**

**3. రాష్ట్రంలోని నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం.**

**4. వేసవిలో భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శన ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించిన టీటీడీ.**

==========================

"వికసిత భారత్" నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించేలా రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగుతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే దిశగా కేంద్ర ప్రభుత్వ సహకారం, రాష్ట్ర ప్రాధాన్యతాంశాలపై కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి నిన్న ఢిల్లీలో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్డీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, అభివృద్ధికి ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి విమానాశ్రయాలు, పోర్టులు, లాజిస్టిక్స్ కారిడార్లు, తయారీ పరిశ్రమల కేంద్రాలు, విద్యా, వైద్య సంస్థల అభివృద్ధితో రాష్ట్రం పురోగమిస్తోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

--------------------------

రాష్ట్రంలో గురుకుల విద్యార్థులకు త్వరలో క్రీడా కిట్లు, ట్రాక్ సూట్లు, బూట్లు అందజేయనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను గుంటూరు జిల్లా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి నిన్న అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. క్రీడలు విద్యార్థుల్లో మానసిక, శారీరక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రోత్సాహకాలను ఇస్తోందని మంత్రి వివరించారు.

--------------------------

శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో ముఖ్యమంత్రి సహాయ నిధి – సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ముఖ్యమంత్రి సహాయనిది అండగా నిలుస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం సహాయం అందించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సత్యకుమార్ పేర్కొంటూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

జూన్, జులై నెలల్లో రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో... పది రాష్ట్రాల్లోని 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ మేరకు జూన్ 18న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. జూన్ 1న నోటిఫికేషన్ విడుదల కానుండగా... నామినేషన్ల దాఖలుకు జూన్ 8 చివరి తేదీగా నిర్ణయించింది. జూన్ 9న నామినేషన్ల పరిశీలన జరగనుంది. నామినేషన్ల ఉపసంహరణకు జూన్ 11 వరకు గడువు ఇవ్వగా... జూన్ 18న ఎన్నికల రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. వీటిలో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రస్తుతం రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, సానా సతీష్‌ల పదవీకాలం ఈ నెల 26న ముగియనుంది. దీంతో రాష్ట్రంలోని నాలుగు రాజ్యసభ స్థానాలకు జూన్ 18న ఎన్నికలు జరగనున్నాయి.

---------------------------

“స్వచ్ఛ సర్వేక్షణ”లో ప్రజల భాగస్వామ్యం కీలకమని విజయవాడ సెంట్రల్ శాసనసభ్యులు బోండా ఉమా మహేశ్వరరావు అన్నారు. విజయవాడలో ఆయన ఈ రోజు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ దేశవ్యాప్తంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్యక్రమమని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విజయవాడ నగరం మెరుగైన స్థానాన్ని సాధించేందుకు ఈ నెల 31 వ తేదీ వరకు “సిటిజన్ ఫీడ్‌బ్యాక్” సర్వేను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తరపున వచ్చే ప్రతినిధులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరుతూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

వేసవి సెలవుల కారణంగా తిరుమలలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగినా... భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లు చేస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి సి. హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసి క్యూలైన్ల నిర్వహణ, నిరంతర పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ప్రతిరోజూ సాధారణ దర్శనాలతో పాటు అదనంగా 15 వేల మందికి పైగా భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తున్నామని తెలియజేస్తూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం విస్తృత స్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించిందని తూర్పుగోదావరి జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, మండల కార్యాలయాల్లో ప్రతిరోజూ గంటపాటు యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యాలయాల్లో 'వై-బ్రేక్ యోగా' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యమని ఆయుష్ అధికారి వివరించారు.

---------------------------

పర్యావరణ పరిరక్షణ ద్వారా జీవ వైవిధ్యాన్ని పెంపొందించాలన్న ఉద్దేశ్యంతో ఈరోజు అంతర్జాతీయ జీవ వైవిధ్య అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. భూమిపై ఉన్న జీవాల మధ్య భేదాన్నే జీవ వైవిధ్యం అంటారు. పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదం చేసే లక్షలాది జంతు జాతులు, వృక్ష జాతులు, నీటి వనరులు ఈ రోజు అంతరించి పోయే దశకు చేరుకున్నాయి. వీటిని పరిరక్షించడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చు. పెరుగుతున్న కాలుష్యం, అడవుల నరికివేత , వాతావరణ మార్పుల వల్ల అంతరించిపోతున్న జీవరాశులను సంరక్షించడం, తద్వారా పర్యావరణాన్ని కాపాడటంపై ప్రజల్లో అవగాహన పెంచడం ఈ రోజు నిర్వహణలోని ముఖ్య ఉద్దేశ్యం.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 134 వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

పురాతన దేవాలయాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మండలం వంజంగి గ్రామంలో నిర్వహించిన శ్రీ వెంకటేశ్వర ఆలయ 15వ వార్షికోత్సవ వేడుకల్లో కేంద్రమంత్రి ఈ రోజు పాల్గొన్నారు. అనంతరం ఆముదాలవలస జగ్గుశాస్త్రులపేట వద్ద 3 కోట్ల 82 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆముదాలవలసను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

======================